క్లుప్తంగా

'అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని శిక్షించాలి'



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బోథ్: రాజ్యాంగంపై, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆర్టీసీ మెకానిక్ ఓం ప్రకాష్ అనే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని భీమ్ ఆర్మీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజ్యాంగాన్ని దుర్భాషలాడడం అంటే దేశాన్ని, జాతీయవాదాన్ని కించపరచడమేనని అన్నారు. ఆయనపై కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భగత్ ప్రవీణ్, పాటిల్ అమత్‌రావ్, మద్దెల మహేశ్, బత్తుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానపర్చేలా సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఆర్టీసీ మెకానిక్ ఓంప్రకాష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు రాజ్యాంగంతోనే ఆర్థిక పరిస్థితి నాశనమవుతుందని పేర్కొనడం సిగ్గుచేటన్నారు. అనంతరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమావేశంలో సందీప్ దాండ్గే, రమేశ్, దయానంద్, రమాకాంత్, సిద్ధార్థ్, షేక్ షకీల్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణ



క్షీరాభిషేకం చేస్తున్న ఓం ప్రకాష్

ఆదిలాబాద్: రాజ్యాంగాన్ని కించపరిచే విధంగా మాట్లాడి అందరి మనోభావాలను కించపరిచినందుకు బహిరంగ క్షమాపణ కోరుతున్నానని ఆర్టీసీ ఉద్యోగి ఓం ప్రకాష్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ చౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. అనుకోకుండా రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం జరిగిందని, దీనిపై వ్యతిరేకత రావడంతో పాశ్చాత్తపానికి గురై అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ గ్యారేజీ నుంచి అనిల్, శ్రీశైలం, రాజలింగు, భీంరావు, అశోక్, దత్తు, అల్తాఫ్, అశీశ్, ఆర్ఎస్ రావు, రాజారాం, అశోక్ పాల్గొన్నారు.

ధ్యానంతోనే ఆరోగ్య సంరక్షణ

ఆదిలాబాద్‌టౌన్: ధ్యానంతోనే ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని వయోవృద్ధుల సమైఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. ఆదివారం వయోవృద్ధుల కార్యాలయంలో శ్రీరాంచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానం నిర్వహించారు. నిత్యం యోగా, ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సునీత, శేఖర్, కిషన్, కిషోర్, దేవన్న, దయాకర్‌రెడ్డి, శ్యామ్, రాజాగౌడ్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

108లో ప్రసవం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గొట్టిగోండు గూడకు చెందిన గర్భిణి అనసూయకు శనివారం రాత్రి పురుటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108లో ఉట్నూర్ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో యేంద గ్రామ సమీపంలోకి రాగానే నొప్పులు అధికం కావడంతో 108 ఈఎంటీ రవికుమార్, పైలెట్ రాజేందర్ అంబులెన్స్‌లోనే పురుడు పోశారు. అనంతరం తల్లీబిడ్డలను ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుఖప్రసవం చేసిన 108 సిబ్బందిని పలువురి అభినందించారు.

పేకాట స్థావరాలపై దాడులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భాగ్యనగర్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురిని టూటౌన్ పోలీసులు ఆదివారం దాడిచేసి పట్టుకున్నారు. పక్కా సమాచారం రావడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారి వద్ద రూ.300 నగదుతో పాటు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రామాయి, రాంపూర్ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆదివారం అరెస్టు చేసిన్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులతో కలిసి దాడి చేశాం. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 6,820, ఐదు ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆయుష్ సేవలు అంతంతే

- ఆరు నెలలుగా నిలిచిన సేవలు
- కొన్ని రోజులుగా సెలవుల్లో యునాని వైద్యురాలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



రిమ్స్ ఆవరణలోని ఆయుష్ ఆరోగ్య మందిరం

ఆదిలాబాద్‌టౌన్: ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, యోగా వంటి ప్రాచీన వైద్యం ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆయుష్ ఆస్పత్రులను ఏర్పాటు చేసింది. అయితే పూర్తిస్థాయిలో రోగులకు వైద్య సేవలు అందడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆయుష్ ఆస్పత్రులకు ఆదరణ కరువైంది. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతోంది. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ఆయుష్ ఆరోగ్య మందిర్ ఉందనే విషయం చాలా మందికి తెలియదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్తారో? తెలియని పరిస్థితి. రోగులు ఆస్పత్రికి వస్తే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వెనుదిరుగుతుండగా, మరికొంత మందికి అక్కడ ఉన్న సిబ్బంది మందులు పంపిణీ చేస్తున్నారు. ఆయుర్వేదిక్ వైద్యంతో ప్రజలకు సైడ్‌ఎఫెక్ట్‌లు రావని వైద్యులు చెబుతుండడంతో ఇటీవల ఆయుష్ ఆస్పత్రి వైపు మల్లుతున్న రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి.

ఆరు నెలలుగా..

ఆయుష్ విభాగంలోని ఆయుర్వేదిక్ డిస్పెన్సరీలో గత ఆరు నెలలకు పైగా సేవలు నిలిచిపోయాయి. ఇక్కడ పనిచేసే సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగ విరమణ పొందడం, ఫార్మసిస్టులు విధులకు హాజరుకాకపోవడం, సెలవుల్లో ఉండడం, అక్కడ పనిచేసే అటెండర్ సైతం కనిపించడం లేదని రోగులు చెబుతున్నారు. ఆయుర్వేద వైద్యం కోసం వచ్చిన వారు వెనుదిరుగుతున్నారు. ప్రత్యామ్నాయంగా వైద్యుడిని అందుబాటులో ఉంచాల్సి ఉండగా, ఆ శాఖాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. యునానికి సంబంధించి ఇక్కడ పనిచేసే సీనియర్ మెడికల్ ఆఫీసర్ గత కొన్ని రోజులుగా సెలవుల్లో ఉన్నారు. ఫార్మసిస్టు, అటెండర్లు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. వీరి ద్వారానే రోగులకు మందులను పంపిణీ చేస్తున్నారు. హోమియోపతికి సంబంధించి కూడా రెగ్యులర్ వైద్యులు లేరు. బజార్‌హత్నూర్ పీహెచ్‌సీలో పనిచేసే మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఆయుర్వేద ఆస్పత్రిలో పనిచేసే సీనియర్ వైద్యురాలు గత కొన్ని నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఫార్మసిస్టు, అటెండర్ సెలవుల్లో ఉన్నారు. సీనియర్ వైద్యులను నియమించాలని ఆయుష్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. యునానిలో పనిచేసే మెడికల్ ఆఫీసర్ సెలవులో ఉన్నారు. హోమియోపతికి సంబంధించి వైద్యురాలు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు.

– శ్రీతల్ రాథోడ్, జిల్లా ప్రోగ్రాం అధికారి

అసంపూర్తి వంతెనతో ఇక్కట్లు

- రూ.2 కోట్ల నిధులతో కొలారి వద్ద వంతెన నిర్మాణం
- పూర్తి కాని అప్రోచ్ రోడ్డు పనులు
- వాహనదారులకు తప్పని తిప్పలు



బురదలో కురుకుపోయిన లారీ (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని కొలారి గ్రామ సమీపంలో ఇచ్చోడ, మహారాష్ట్ర అంతర్రాష్ట్ర రాహదారిపై నిర్మించిన వంతెన పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షం పడిన ప్రతీసారి వాహనాలు బురదలో ఇరుక్కుపోతున్నాయి.

రూ.2 కోట్ల నిధులతో..

ఇచ్చోడ, మహారాష్ట్రలోని కిన్వట్, నాందేడ్ వరకు గల అంతర్రాష్ట్ర రహదారిపై మండలంలోని కొలారి గ్రామం వద్ద వంతెన నిర్మాణానికి 2023లో ఆర్అండ్‌బీ ద్వారా రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 2024 జనవరిలో వంతెన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కానీ వంతెన నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టలేదు. తాత్కాలికంగా గ్రావెల్ పోసి వదిలేశారు. దీంతో చిన్నవర్షానికే రోడ్డు బురదమయంగా మారుతుంది. వాహనాలు బురదలో కురుకుపోవడంతో కాలినడకన వంతెన దాటాల్సి వస్తోంది. మోటర్ సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇచ్చోడ నుంచి సొనాల, కిన్వట్, నాందేడ్ వెళ్లే ప్రయాణికులు 30 కిలోమీటర్లు బోథ్ మీదుగా అదనంగా ప్రయాణించాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయాలి



కొలారి గ్రామం వద్ద వంతెన పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. రైతులు ఎరువులు, నిత్యావసర సరకులు తీసుకరావడానికి గ్రామం నుంచి మండల కేంద్రానికి 2 కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు అవస్థలు పడుతున్నాం. త్వరగా వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. – రియాజ్ ఖాన్, కొలారి

పనులు ప్రారంభిస్తాం

కొలారి వద్ద నిర్మించిన వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పనులు గత వేసవిలో చేపట్టాల్సి ఉంది. వర్షాల కారణంగా పనులు ప్రారంభం కాలేదు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత పనులు చేపడుతాం. నెల రోజుల్లో అప్రోచ్ రోడ్డు బీటీ పనులు పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగిస్తాం. – నర్సయ్య, ఈఈ ఆర్అండ్‌బీ, ఆదిలాబాద్

కొనసాగుతున్న దండారీ ఉత్సవాలు



బజార్‌హత్నూర్: నృత్యం చేస్తున్న గుస్సాడీలు



భీంపూర్: నృత్యం చేస్తున్న అడ్డి భోజారెడ్డి



నేరడిగొండ: ఉత్సవాల్లో పాల్గొన్న ఆడే గజేందర్

బజార్‌హత్నూర్: మండలంలోని ఆదివాసీ గిరిజన గూడెల్లో దండారీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఘచింతలసాంగ్వీ, మాడగూడ, జాతర్ల, అందుగూడ, ఉప్పర్‌పల్లి, భూతాయి, గిరిజయి, డేడ్ర, కొత్తపల్లి గ్రామాల్లో గుస్సాడీల డెంసా నృత్యం చేశారు. రేలా రేలా పాటలతో సందడి చేశారు. గ్రామాల నుంచి వచ్చిన గుస్సాడీలకు స్వాగతం పలికి విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

బోథ్: ఆదివాసీ సంస్కృతికి ప్రతీకగా నిలిచే దండారీ ఉత్సవాలు బోథ్ మండలంలోని ఇంకరిగూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు వనవాసీ కల్యాణ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, దేశ్‌పాండే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్కృతికి మూలం ఆదివాసీలని, భారత దేశం యొక్క ఆత్మ నగరాలు, పట్టణాల్లో కాకుండా ఆదివాసీ సమాజంలోనే కనిపిస్తోందన్నారు. రాణి దుర్గావతి, బిర్సాముండా, కుమురం భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఆదివాసీల ప్రేమానురాగాలు మరవలేనివి..

నేరడిగొండ: ఆదివాసీలు చూపిస్తున్న ప్రేమానురాగాలు మరవలేనివని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని లింగట్ల గ్రామంలో ఆదివారం దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు, గుస్సాడీలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని, భవిష్యత్ తరాలకు వీటిని అందించాల్సిన అవసరం ఉందన్నారు.

భీంపూర్: మండలంలోని నిపాని గ్రామంలో దండారీ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి హాజరయ్యారు. ఆయనకు గ్రామస్తులు గుస్సాడీ నృత్యంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయం ప్రకారం నృత్యం చేస్తూ.. సందడి చేశారు. అనతిగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కోలాటం ఆడిన ఎమ్మెల్యే



కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఇంటి ఆవరణలో దండారీ ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. గుస్సాడీ నృత్యం, దండారీ కోలాటంతో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ దుస్తులు ధరించి తన కొడుకుతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

రైతులకు బోనస్ ఇచ్చి ఆదుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: ఈ ఏడాది భారీగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బ తిని రైతులు నష్టపోయారని, పత్తి, సోయా, మొక్కజొన్న పంటలకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లించి రైతులను ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయా మార్కెట్‌యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. బోనస్ ఇచ్చి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు కష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా మొక్కజొన్న పంట కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కుంర కోటేశ్, పీఏస్సీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ శేషారావు, ఏనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, గాడ్గే సూభాష్, పాండురంగ్, భూమన్న పాల్గొన్నారు.

బోథ్: బోథ్ నియోజకవర్గ రైతులు పండించిన పత్తి, సోయా, మొక్కజొన్న పంటలకు తక్షణమే బోనస్ ప్రకటించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతు సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మొక్కజొన్నతో పాటు సోయాబిన్, పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్ల కోసం ప్రవేశపెట్టిన 'కిసాన్ కపాస్ యాప్' ద్వారా రైతులకు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులు దళారులకు పంట అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బోథ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం బోథ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ సౌజన్యంతో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆవు పేడ ప్రమిదల ఉచిత పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆవు పేడతో ప్రమిదలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి ప్రణయ్, ఎంపీడీవో రమేశ్, సొసైటీ ఉపాధ్యక్షుడు దాసరి పురుషోత్తం, రమణగౌడ్, అబ్దుల్ రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి రాథోడ్ జీవన్

ఇచ్చోడ: మండలంలోని కామాగిరిలో ఆదివారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువులకు చెవిపోగుల ఆధార్ కూడా వేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న టీకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం గ్రామాలకు వస్తున్న పశువైద్య సిబ్బందికి పశువులు అందుబాటులో ఉండే విధంగా రైతులు చూడాలని కోరారు. కార్యక్రమంలో పశు సహాయకురాలు సంధ్య, శేఖర్, రమేశ్, ఉదయ్, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: టీకాలతోనే గాలికుంటు నివారణ సాధ్యమని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. ఆదివారం మండలంలోని ధన్నూర్ (డి) గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువులకు సోకే ప్రధాన వ్యాధుల్లో గాలికుంటు ఒకటన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ జేఏసీ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆదివారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో మండల బీసీ జేఏసీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గాడ్గే సూభాష్, అధ్యక్షుడిగా నరాల రమణయ్య, ఉపాధ్యక్షుడిగా అంబేకర్ పాండురంగ్, ముండే పాండురంగ్, మాధవ్‌రావు అమ్టే, షేక్ ముస్తాఫా, రమేశ్, ప్రధాన కార్యదర్శిగా పిల్లి నరేశ్, అరుగుల గణేష్, ఆసం మనోహర్, రాకేశ్, సహాయ కార్యదర్శులుగా అబ్దుల్ అజీం, అంగ రాజేశ్వర్, జాహెద్, రేసుపోతారెడ్డి, రషీద్, మహిబుబ్, శ్రీనివాస్‌యాదవ్, జాదవ్‌కిరణ్, సూర్యవంశిరామారావు, ప్రవీణ్, ఇంగోలే శివకుమార్, బలగం రవి, తోగటి లక్ష్మణ్, తదితరులను ఎన్నుకున్నారు.

'చిన్నారులను పనిలో పెట్టుకోవద్దు'




మాట్లాడుతున్న రాజలింగు

ఆదిలాబాద్: చిన్నారులను పనిలో పెట్టుకుంటే యజమానులపై చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి. రాజలింగు హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. క్రాకర్స్ షాప్స్ ప్రమాదకరమైనవని పనులో పెట్టుకున్న సంబంధిత షాప్ యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. రెండు రోజుల పాటు శాఖ తరఫున తనిఖీలు చేస్తామన్నారు. ఆపదలు ఉన్న పిల్లల కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 100కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, క్రాకర్ షాప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేందర్, షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కె. వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్లు కిరణ్, సౌజన్య, అనిల్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఇంట్లో దొంగతనం

జైనథ్: మండల కేంద్రానికి చెందిన సింగిడి లక్ష్మి ఇంట్లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు పదివేల రూపాయలతో పాటు, 12 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సింగిడి లక్ష్మి ఉదయం పొలం పనులకు వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా ఇంటి తలుపులు, బీరువా తలుపులు సైతం పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



వివిధ డిజైన్ల ప్రమిదలు



టపాసులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

దీపావళికి సర్వం సిద్ధం

ఆదిలాబాద్: వెలుగుల పండుగకు సర్వం సిద్ధమైంది. దీపావళి వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ప్రజలు నిమగ్నమయ్యారు. సోమ, మంగళ వారాల్లో లక్ష్మి పూజలు, దీపావళి వేడుకలను నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీపాలు, పూజా సామగ్రి కొనుగోలులో నిమగ్నమవగా.. టపాసులు కొనుగోలు చేసేందుకు చిన్నారులు మార్కెట్‌కు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. రంగుల ముగ్గులు, పువ్వులు, ప్రమిదలు కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి కనబరిచారు.

నేడే పండుగ జరుపుకోవాలి

నేరడిగొండ: దీపావళి అమావాస్య సోమ, మంగళ వారం రెండు రోజులు వస్తున్న నేపథ్యంలో పండుగ ఏ రోజున జరుపుకోవాలనే సందేహం ప్రజల్లో నెలకొంది. దీనిపై ప్రముఖ వేదపండితుడు డాక్టర్ ఎల్యాచి శ్రావణ్ కుమార్ జోషి స్పష్టత ఇచ్చారు. దీపావళి పండగ, ధనలక్ష్మి పూజలు సోమవారం రోజునే జరుపుకోవాలని, మంగళవారం కేదారేశ్వర నోములు, బుధవారం పాడ్యమి పూజలు, బగినీహస్త భోజనం జరుపుకోవాలని సూచించారు.

రోడ్డు పక్కనే పార్కింగ్



రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన భారీ వాహనాలు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణం మీదుగా జిల్లా కేంద్రానికి అనుకొని ఉన్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం గుండా ప్రతీ రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ట్రాన్స్‌ఫార్మర్

బోథ్ మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు. అలాగే తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యుత్ వైర్లు చెట్టు కొమ్మలను తాకుతున్నాయి. కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - బోథ్



చెట్టు కొమ్మలను తాకుతున్న విద్యుత్ తీగలు